క్లుప్తంగా

మండలంలో జేసీ పర్యటన



రొంపిచర్ల : మండలంలో గోగులపాడు, విప్పర్ల పల్లి గ్రామాలలో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె పర్యటించారు. రీ సర్వే పనులను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. విప్పర్లపల్లి అగ్రహారంలో ఇనాం భూముల గురించి చర్చించారు. ఆక్రమణకు గురైన వాటిపై నివేదిక కోరారు. తహసీల్దార్ బి.నిర్మల, ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్ఓలు, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల పర్యవేక్షణకు అధికారుల నియామకం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా పాతనాగిరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాసరావు డిపార్టుమెంటల్ అధికారిగా కె.భారతిరాణి (సీతారామపురం, నూజెండ్ల మండలం) నియమితులైనట్లు శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచెం బొడ్డపాటి విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. మండలంలోని 5 జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాయనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫర్నిచర్

రొంపిచర్ల: స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి దాతలు కొడూరి అంకాలయ్య, బోయపాటి కోమలి, తల్లపనేని శ్రీనివాసులు సామగ్రి అందించారు. స్టడీ టేబుల్స్ 10, కుర్చీలు 25, ఫ్యాన్‌ను వీటిలో ఉన్నాయి. సీడీపీవో ఉమామహేశ్వరి సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రానికి అందజేశారు. దాతలను సీడీపీవో అభినందించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశిదేవి, కార్యకర్త విజయలక్ష్మి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ

వినుకొండ: మండలంలోని నిర్మలా స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న షేక్ మహరూఫ్ నదీమ్ అనే విద్యార్థి నేషనల్ డిఫెన్స్ కరాటే ది చాంపియన్ షిప్ వారు చిలకలూరిపేటలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ బెనేడిక్ట్, ఉపాధ్యాయులు అభినందించారు. కరాటే మాస్టర్ షేక్ ఖాజామొహిద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పదవీ విరమణ సత్కారం

నరసరావుపేట: పల్నాడు జిల్లా పోలీసు ఆర్మ్‌డ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదవీ విరమణ పొందిన బాల బ్రహ్మానందరెడ్డిని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మానించారు. ఏఆర్ అదనపు ఎస్పీ వి.సత్తిరాజు, డీఎస్పీ మహాత్మా గాంధీరెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, ఏవో కేవీవీ రామారావు, ఏపీ పోలీసు అధికారుల సంఘ జిల్లా ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

అత్యవసరానికీ అవస్థలే!

- అలంకారప్రాయంగా మారిన మరుగుదొడ్లు
- పలు పాఠశాలల్లో విద్యార్థులకు తప్పని కష్టాలు
- వసతిగృహాల్లో పరిస్థితి దారుణం

స్వచ్ఛ భారత్ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశుభ్రత విషయంలో పలు కార్యాక్రమాలు అమలు చేస్తున్నట్లు చెబుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కనీసం పట్టించుకునే వారే కరవయ్యారు.

నూజెండ్ల: మండల కేంద్రమైన నూజెండ్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. వందల మంది విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాలలో విద్యాబోధనతోపాటు మౌలిక వసతుల విషయంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా అధ్వానంగా మారిపోయింది. మరుగుదొడ్ల నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యంగా కనిపిస్తోంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

పట్టించుకునే దిక్కు లేదు..

మోడల్ స్కూలు లోపల నిర్మించిన మరుగుదొడ్లు సౌకర్యవంతంగా లేకపోవటంతో పాఠశాల ఆవరణలో బాలబాలికలు కోసం ప్రత్యేకంగా నిర్మాణాలు చేశారు. అవి పూర్తి అయినప్పటికీ వినియోగంలోకి తీసుకురావడం లేదు. అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగించాల్సిన దుస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినా నేటికీ అసంపూర్తిగా మిగిలాయి. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు కొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేపట్టినా పురోగతి కనిపించడం లేదు.



మోడల్ స్కూల్‌లో వినియోగంలో లేని మరుగుదొడ్లు

వాగుకు పరుగు పెట్టాల్సిందే..

పలు వసతి గృహాల్లోనూ దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు ఉన్నాయన్న సంగతే మరిచిపోయామని విద్యార్థులు అంటున్నారు. బహిర్భూమికి వెళ్లాలంటే దూరంగా ఉన్న వాగుకు పరుగులు తీయాల్సి వస్తోందని చెప్పారు. రాత్రి సమయంలో విషపు పురుగులు, పాములు, ఇతర జంతువుల భయం ఉన్నప్పటికీ బయటకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి తగిన నిధులు విడుదల చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



జెడ్పీ పాఠశాలలో అసంపూర్తిగా నిర్మాణం



బాలుర వసతి గృహంలో ఇదీ దుస్థితి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా

వినుకొండ: వినుకొండ మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేశారు. మున్సిపల్ కార్యాలయం ముందు శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ డీఈ విష్ణుమూర్తి కార్మికులను మానసికంగా వేధిస్తున్నారని, జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ వారితో చర్చించారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి ధర్నా విరమింపజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రేవిళ్ల శ్రీనివాసరావు, నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

నేడు పింఛన్ల పంపిణీ

బొల్లాపల్లి: మార్చి నెలకు సంబంధించిన పింఛన్‌ను లబ్ధిదారులకు శనివారం ఉదయం 7 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పి.సీతారామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో 8,702 మందికి రూ.3.79 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది పింఛన్ అందజేస్తారని తెలిపారు.

ఘనంగా టైలర్స్ డే



నరసరావుపేట ఈస్ట్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో శుక్రవారం సాయంత్రం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ ప్రతినిధి పూనూరి కృష్ణకుమారి ఆధ్వర్యంలో పాతికేళ్లుగా ఈ వృత్తిలో ఉన్న తొమ్మిది మందిని సత్కరించారు. శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ సభ్యుడు బత్తుల మురళి, వెల్లంపల్లి కేశవరావు, పల్లంకి కృష్ణసౌజన్య, ఆర్.వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి గెలుపుపై నేతల ధీమా

నరసరావుపేట: ఉమ్మడి గుంటూరు–కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలలో కె.ఎస్ లక్ష్మణరావు మొదటి ప్రాధాన్యతా ఓట్లతో గెలవడం ఖాయమని పీడీఎఫ్ ఎన్నికల పల్నాడు జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.మోహనరావు, కో కన్వీనర్ ఎస్.ఆంజనేయనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు ఈ మేరకు తెలిపారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.ప్రేమ్‌కుమార్, మాజీ జిల్లా కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



విలేకరుల సమావేశంలో పీడీఎఫ్ నాయకులు

ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా పోలింగ్ తీరు

నరసరావుపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ తీరు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా నిలిచిందని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి అభ్యర్థిని అక్రమంగా గెలిపించేందుకు రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. యంత్రాంగాన్ని ఉపయోగించి దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. 80 శాతం కంటే ఎక్కువ పోలింగ్ జరిగిన ప్రతి బూత్‌లో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయ నాయక్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో సీపీఎం నాయకులు

పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

వినుకొండ : పాడి రైతులు గాలి కుంటు, బ్రూసెల్లా టీకాలు తమ పశువులకు సకాలంలో వేయించాలని వినుకొండ ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.సరోజాదేవి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా గాలి కుంటు, బ్రూసెల్లా వ్యాధుల నివారణ టీకాలు కార్యక్రమం మార్చి 1 నుంచి 30వ తేదీ వరకు వినుకొండ, నూజెండ్ల మండలాల్లోని అన్ని గ్రామాల్లో రెండు బృందాల ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నూజెండ్ల: గాలికుంటు వ్యాధిపై పాడి పోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి శివాజీ అన్నారు. మండల కేంద్రం నూజెండ్ల గ్రామం పశువైద్యశాలలో ఈ వ్యాధిపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు.

స్కాలర్‌షిప్ టెస్ట్ ఫలితాలు ప్రకటన

యడ్లపాడు: బాసట సామాజిక సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి పదవ తరగతి ప్రభుత్వ పాఠశాలల 'ప్రతిభా చాలెంజ్ స్కాలర్‌షిప్ టెస్ట్' ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. విజేతలకు మే నెలలో నిర్వహించే 'సమ్మర్ స్టడీ క్యాంప్'లో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని 10 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 304 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. తొలి అయిదు స్థానాల్లో బి.యశస్వి (లింగారావుపాలెం), ఎ.గీతశ్రీలక్ష్మి (సొలస), ఎస్.మేఘనశ్రీ (లింగారావు పాలెం), ఎస్. నాగ అజయ్‌బాబు (లింగారావు పాలెం), డి.హారిక (లింగారావు పాలెం) నిలిచారు. వీరికి వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.11 వేలు, రూ.9 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నారు. కె.అక్ష (జగ్గాపురం), బి.రాజశేఖర్ (ఉన్నవ), అబ్దుల్ అజాక్ (యడ్లపాడు), హేమంత్‌శ్రీ నీరద్(వంకాయలపాడు)లకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు.



మొదటి ఐదు ర్యాంకులు సాధించిన విద్యార్థులు

జ్ఞానసరస్వతి శక్తి పీఠానికి రూ.33 లక్షల విరాళాలు

నరసరావుపేట రూరల్: ఉప్పలపాడు రోడ్డులోని జ్ఞానసరస్వతీ శక్తిపీఠంలో శుక్రవారం కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. దాతల నుంచి సేకరించిన విరాళాలు, వాటి వినియోగంపై చర్చించారు. కమిటీ సభ్యులు వేలూరి సుబ్బారెడ్డి, గంజి హనుమంతరావు ఆధ్వర్యంలో దాతలు నుంచి రూ.33 లక్షలు విరాళాలు సేకరించారు. ఈ నగదును మూలనిధిగా ఉంచి ధూప దీప నైవేద్యం కోసం వినియోగించాలని నిర్ణయించారు. దాతల నుంచి విరాళాలుగా సేకరించిన నగదును సుబ్బారెడ్డి, హనుమంతరావులు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురిని సత్కరించారు. ట్రస్ట్ చైర్మన్ చివుకుల అన్నపూర్ణ, అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్మోహనరెడ్డి, కార్యదర్శి జి.రామంజనేయులు, కోశాధికారి గజవల్లి ఆదినారాయణ, సభ్యులు లింగారెడ్డి, ఈశ్వరరెడ్డి, పంతంగి శ్రీను, న్యాయవాదులు శ్రీశైలంకుమార్, అయ్యప్పరాజు, హరి, మణికుమార్ పాల్గొన్నారు.



విరాళాన్ని ట్రస్ట్ సభ్యులకు అందజేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన బైపాస్‌పై గణపవరం–కావూరు డొంక రోడ్డు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. 108 సిబ్బంది, హైవే పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నుంచి మార్టూరు వెళ్తున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో కారు అదుపు తప్పి డివైడర్ దాటి గుంటూరు వైపు వెళ్తున్న కారును ఢీకొని.. మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. ద్విచక్రవాహనంపై గుంటూరు వెళ్తున్న కావూరు లింగంగుంట్లకు చెందిన రావినూతల నాగేశ్వరరావు, ఆయన భార్య వెంకటలక్ష్మి గాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ఇద్దరిని చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారును ఢీకొన్న లారీని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద సీసీ కెమెరాల ద్వారా వాహనాన్ని నిలుపుదల చేయించారు. దీనిపై పోలీసులు కేసు విచారిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.



దంపతులకు ప్రాథమిక చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



వైజ్ఞానిక ప్రదర్శనకు హాజరైన విద్యార్థులు



వినుకొండ: వేడుకల్లో చిన్నారులు



శావల్యాపురం: సైన్సు నమూనాల ప్రదర్శన



నమూనాలను తిలకిస్తున్న నాతాని తదితరులు

నరసరావుపేట రూరల్: విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలపై అందరూ దృష్టి సారించాలని ఏఎం రెడ్డి కళాశాలల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఆవిష్కార్–25 పేరిట వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్ రావు, డీన్ డాక్టర్ లక్ష్మీసురేఖ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జునరావు, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండ: పట్టణంలోని విజేత కాన్సెప్ట్ స్కూల్‌లో సైన్స్ డే వేడుకల్లో డైరెక్టర్ సాయికుమార్, బ్రహ్మయ్యలు ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు.

శావల్యాపురం: వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని, వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావులు పాల్గొన్నారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

■ శ్రీరామా పబ్లిక్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

■ మండలంలోని గంటావారిపాలెం గ్రామం ఎంపీపీ స్కూల్లో ఏర్పాటైన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముప్పాళ్ళ రమాదేవి ఉపాధ్యాయురాలు లక్ష్మి పాల్గొన్నారు.

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు.

నాదెండ్ల: విద్యార్థి జీవితంతోపాటు సమాజాభివృద్ధిలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందని హెచ్ఎం ఐ.కృష్ణానాయక్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిరుమామిళ్ళ నడికట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

చిలకలూరిపేట: ఏఎంజీ విద్యాసంస్థల ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ డాక్టర్ రబ్బీ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.

■ పసుమర్రు గ్రామంలోని ఎస్ఎంకే జెడ్పీ హైస్కూల్‌లో సైన్సు ఎగ్జిబిషన్, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు.

యడ్లపాడు: విద్యార్థులు ప్రతిభ చాటడం గురువుల కృషికి తార్కాణం అని డీఈవో ఎల్. చంద్రకళ చెప్పారు. మైదవోలు మండల పరిషత్ బీసీ ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని డీఈవో ప్రారంభించారు.



పసుమర్రులో బహుమతులు ప్రదాన దృశ్యం



చిరుమామిళ్లలో విజేతలతో ఉపాధ్యాయులు



నమూనాలు తిలకిస్తున్న డీఈవో చంద్రకళ

సంక్షిప్త వార్తలు

ఆర్టీసీ డ్రైవరుగా సేవలు అభినందనీయం

వినుకొండ : కంకణంపాటి లక్ష్మీనారాయణ డ్రైవర్‌గా వినుకొండ ఆర్టీసీకి అందించిన సేవలు అభినందనీయమని సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోనందు శుక్రవారం లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏజీపీ ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావు, శ్రీరాములు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కాజా, సాంబశివరావు, హరిబాబు, గణపవరం శ్రీను, రిటైర్డ్ డ్రైవర్ కంకణంపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించండి

రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం సెక్టార్ మీటింగ్‌లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా సీడీపీవో ఉమామహేశ్వరి హాజరయ్యారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. నీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను కూడా సీడీపీవో పరిశీలించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.దేవీబాయి, సోషల్ వర్కర్‌లు ప్రేమ్, బాలాజీ, సాగర్, మునుమాక సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలి

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం రైతు సేవా కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ ప్రతి రైతూ విధిగా సంఖ్యకు నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీతో పాటు ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబర్‌ను కూడా అందజేయాలన్నారు. ఏవో శివలలిత, వీఏఏ కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.